ప్రసంగ పాఠాన్ని పంపలేదు

- గవర్నర్ తమిళి సై ఆవేదన
- రాజ్‌భవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- సిఎస్, డిజిపి హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'గణతంత్ర వేడుకల విషయంలో కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు..కనీసం ప్రసంగ పాఠాన్ని కూడా పంపలేదు...' అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్ రాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహిం చాలంటూ రెండు నెలల క్రితమే ప్రభుత్వానికి లేఖ రాశానని ఆమె తెలిపారు. అయితే ఆ లేఖను పక్కనబెట్టి రాజ్‌భవన్‌లోనే నిర్వహించుకోవాలంటూ రెండు రోజుల క్రితమే సమాచారమిచ్చారని చెప్పారు. ఇలాంటి విషయాలన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ తమిళి సై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి అంజనీ కుమార్‌తోపాటు సినీ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, గీత రచయిత చంద్రబోస్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ... గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే తెలంగాణ ఆవిర్భవించిందని చెప్పారు. రాష్ట్ర చరిత్ర, విశిష్టత చాలా గొప్పదని అన్నారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ ప్రదర్శించిన అంకితభావం చాలా గొప్పదని నివాళులర్పించారు. హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో దూసుకుపోవటం హర్షణీయమని కితాబిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను రాజ్‌భవన్ తప్పకుండా అందిస్తుందని తెలిపారు. ఇదే సమయంలో కొత్త భవనాలను కట్టడాన్ని మాత్రమే అభివృద్ధిగా చూడకూడదని వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, కార్మికులు, ఇలా అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని తెలిపారు. అనంతరం ఆమె పుదుచ్చేరికి బయలుదేరి వెళ్లారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో జాతీయ పతాకాన్ని ఎగరేశారు. తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాగా ఉదయం రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లోగానీ, గురువారం రాత్రి అక్కడ ఏర్పాటు చేసిన 'ఎట్ హోం' కార్యక్రమంలో గానీ సిఎం కెసిఆర్ పాల్గొనలేదు. ఆ రెండింటికీ ఆయన గైర్హాజరయ్యారు.

కదిలిన రైతన్నల దండు

- రాష్ట్ర వ్యాప్తంగా కర్షకుల ట్రాక్టర్స్ మార్చ్
- మిర్యాలగూడలో పెద్దఎత్తున ర్యాలీ
- మద్దతు తెలిపిన ప్రజాసంఘాలు
- రైతు వ్యతిరేక విధానాలు తెస్తే మోడీని గద్దె దింపుతాం : నేతలు

"రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తే మోడీని గద్దె దింపుతాం.. రైతుల ఆందోళనతో రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలపై వెనక్కి తగ్గిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. ఆ సమయంలో రైతులకిచ్చిన హామీలను విస్మరించింది.. తొమ్మిది హామీలను వెంటనే అమలు చేయాలి.. పార్లమెంటులో కనీస మద్దతు ధర చట్టం చేయాలి" అని రైతుల ట్రాక్టర్స్ మార్చ్‌లో నేతలు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం రైతులు ట్రాక్టర్స్ మార్చ్ నిర్వహించారు.

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అఖిలభారత కిసాన్ సభ (రైతు సంఘం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్ల ర్యాలీ తీశారు. కిలోమీటర్ పొడవునా టాక్టర్లు బారులు తీరాయి. ప్రతి ట్రాక్టర్‌పై ఆకుపచ్చ జెండాలు పెట్టి ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను సంఘం జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తే మోడీని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. కనీస మద్దతు ధర చట్టంతోపాటు రైతులకు బోనస్ అందించి ఆదుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే ఆలోచనలను మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులను అరికట్టి నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. సబ్సిడీపై యూరియా, విత్తనాలు ఇవ్వాలని కోరారు. 50 ఏళ్లు నిండిన రైతులందరికీ రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని, పది లక్షల మంది రైతులతో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. చలో ఢిల్లీకి రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్రం.. : చెరుపల్లి

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల వీరోచిత పోరాటంతో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన ప్రధాని మోడీ.. ఆ విధానాలనే అనుసరిస్తూ వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు పెరిగి అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. పేద ప్రజలు, రైతులు రోజు రోజుకూ మరింత పేదలుగా మారుతుంటే అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తల ఆస్తులు రెండు వందల రెట్లు పెరిగి ప్రపంచ కుబేరుల వరుసలో మొదటి, రెండో స్థానాలకు ఎగబాకారని చెప్పారు. ప్రజల ఆస్తులైన రైల్వే, విమాన యానం, ఓడ రేవులు, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతున్నారని విమర్శించారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకార్‌రెడ్డి ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. మునుగోడులో రైతు సంఘం (సిపిఎం) రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, రైతు సంఘం (సిపిఐ) రాష్ట్ర నాయకులు నెల్లికంటి సత్యం ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు కొప్పోజు సూర్యనారాయణ, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి కొత్త కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడారు.

ఉమ్మడి జిల్లాలో ఎఐకెఎస్ ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్, బైక్ ర్యాలీ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్ నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ నాయకుడు కె.భూమయ్య మాట్లాడారు.

సిద్దిపేటలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ నుంచి సిద్దిపేట పాత బస్టాండ్ మీదుగా ముస్తాబాద్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ సాగింది. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 74వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గురువారం ప్రగతిభవన్‌లో జాతీయ పతావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డా బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రావు, శంభీపూర్ రాజు, మధుసూధనాచారి, సిఎస్ శాంతి కుమారి, డిజిపి అంజనీ కుమార్, సిఎంఓ ఉన్నతాధికారులు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అమర జవానులకు సిఎం కెసిఆర్ శ్రద్ధాంజలి ఘటించి, ఘన నివాళులు అర్పించారు. ప్రగతి భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో అమర జవానుల స్మారక స్థూపం వద్దకు వెళ్లి జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశం కోసం అమర జవానుల త్యాగాలను సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు.

గణతంత్ర దినోత్సవ సందర్భంగా గురువారం బిఆర్‌కెఆర్ భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలు, ఉపకార్యదర్శులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లెజిస్లేటివ్ సెక్రటరీ డా.వి.నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు. శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ ,బాబాసాహెబ్ అంబెద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు.

గణతంత్ర దినోత్సవ సందర్భంగా గురువారం మాసబ్ ట్యాంక్ ఎఫ్‌డిసి కాంప్లెక్స్‌లోని సమాచార భవన్‌లో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ రాజమౌళి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సతీమణి విజయలక్ష్మీతో కలిసి దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాలకు హాజరయ్యారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నేటి నుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- 30 వరకు సమర్పణకు గడువు
- ఫిబ్రవరి 1 నాటికి రెండేళ్ల సర్వీసు ఉన్నోళ్లే అర్హులు
- మార్గదర్శకాలు, షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సమర్పణకు గడువు ఈ నెల 30 వరకు ఉంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను (జిఒ నెంబర్ 5) గురువారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు, మాన్యువల్‌గా పదోన్నతుల ప్రక్రియను చేపడతామని తెలిపారు. కేటగిరీ వారీగా ఖాళీలు, ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాలు ఆన్‌లైన్‌లో ప్రకటిస్తామని పేర్కొన్నారు. శనివారం నుంచి ఈ నెల 30 వరకు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లు సంబంధిత ఎంఇఒలకు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు.. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీఈవోకు ఈ నెల 31 నుంచి వచ్చేనెల రెండో తేదీలోపు సమర్పించాలని తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల మార్గదర్శకాలు :

- ఒకే పాఠశాలలో ఫిబ్రవరి ఒకటి నాటికి కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసేందుకు అర్హులు.
- ఒకే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంలు ఐదేండ్లపాటు మిగతా ఉపాధ్యాయులు ఎనిమిదేండ్లు పనిచేస్తే బదిలీ తప్పనిసరి.
- రిటైర్‌మెంట్‌కు ముందు మూడేండ్ల సర్వీసు ఉన్న వారి ఇష్టప్రకారం బదిలీ ఉంటుంది.
- అన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈ నెల 28 నుంచి 30 వరకు స్వీకరిస్తారు.
- ఏప్రిల్ 23న రిలీవ్ అయి 24న బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి.
- స్పౌజ్, వికలాంగులు, పెండ్లికానివారు, వితంతువులకు 10 పాయింట్లు అదనంగా ఉంటాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల ఉద్యోగులకు స్పౌజ్ వర్తిస్తుంది.
- ఓడీ ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, గుర్తింపు పొందిన సంఘాల జిల్లా, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 10 అదనపు పాయింట్లు ఉంటాయి.
- ఒకే జిల్లాలో పని చేస్తున్న వారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు వర్తిస్తాయి.
- ప్రధానోపాధ్యాయులకు మల్టీజోన్ స్థాయిలో, ఇతర ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో బదిలీలు, పదోన్నతులు జరుగుతాయి.

జిఒ సర్వీసు బదిలీలకు అనుమతివ్వాలి : యుఎస్‌పిసి

సాధారణ బదిలీల్లో జిఒ సర్వీసుతో ఉపాధ్యాయులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశమివ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) డిమాండ్ చేసింది. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా రెండేండ్ల కనీస సర్వీసు ఉన్న వారే అర్హులని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపింది. ఈ సమస్యలు కొందరు ఉపాధ్యాయుల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయని విమర్శించింది. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి హామీ ఇచ్చిన విధంగా సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సాధారణ బదిలీలకు ముందే స్పౌజ్ టీచర్లకు న్యాయం చేయాలని కోరింది. స్థానికంగా పని చేస్తున్న ఉపాధ్యాయులను 317 జిఒ పేరుతో స్థానికేతర ప్రాంతాల జిల్లాలకు కేటాయించి ఏడాది పూర్తయ్యిందని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి సదానందంగౌడ్, ఎం పర్వత్‌రెడ్డి తెలిపారు. వారికి జీరో సర్వీసును బదిలీ అర్హతగా పరిగణించి సర్వీసు పాయింట్లను కూడా లెక్కించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీరో సర్వీసు ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, ముత్యాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులను కేటాయించినపుడు పాఠశాలల అవసరం మేరకు మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారని తెలిపారు. జీరో సర్వీసు ప్రాతిపదికన ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని టిఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. 22 వేల మంది ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి బాధితులుగా ఉన్నారని తెలిపారు. వారికి సత్వరం న్యాయం చేయాలని కోరారు.

జాతీయోద్యమం తరహాలో మరో పోరాటం

- హామీలు అమలు చేయకుంటే మోడీ సర్కారును గద్దెదించుతాం
- ఎస్‌కెఎం నేతల హెచ్చరిక
- ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ నుంచి ఇందిరాపార్క్ వరకు ప్రదర్శన

ప్రదర్శన నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని రైతాంగానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని హెచ్చరించారు. డిమాండ్ల సాధన కోసం జాతీయోద్యమం తరహాలో మరోపోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. భవిష్యత్తులో రైతాంగ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా నిర్మిస్తామన్నారు. ఎస్‌కెఎం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఆర్‌టిఇసి క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు టి సాగర్, పశ్య పద్మ, రాయల చంద్రశేఖర్, కోటేశ్వర్‌రావు, జక్కుల వెంకటయ్య, కొండారెడ్డి, కొండల్, ప్రసాదన్న, ప్రజాసంఘాల నాయకులు ఆర్ వెంకట్రాములు, సృజన మాట్లాడుతూ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మోడీ తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలతోపాటు విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలంటూ సుమారు 13 నెలలపాటు రైతులు ఐక్యంగా పోరాడారని గుర్తు చేశారు. 750 మంది రైతాంగ అమరవీరుల త్యాగాలతో సాగిన ఆ ఉద్యమం ఫలితంగా 2021, డిసెంబర్ తొమ్మిదిన సమస్యలను పరిష్కరిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా హామీచ్చిందని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణబిల్లును రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని చెప్పారు. లఖింపూర్‌ఖేరి ఘటనకు బాధ్యులైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని మార్చి రైతులకనుగుణంగా చేయాలన్నారు. చిన్న-సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు నెలకు రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. కౌలు రైతులకు రుణార్హత కార్డులివ్వాలనీ, అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం పోడు సాగుదార్లందరికీ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సహాయ కార్యదర్శులు రమేష్, శ్రీకాంత్, నగర కార్యదర్శి ఎం వెంకటేష్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఛత్రపతి వారసుడు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ 13వ వారసుడు, మాజీ ఎంపి ఛత్రపతి శంభాజీ రాజే గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ ఆయన్ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. పలు అంశాలపై వారు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి శంభాజీరాజే సిఎం కెసిఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 'రాజర్షి సాహు ఛత్రపతి' పుస్తకాన్ని శంభాజీ రాజే సిఎం కెసిఆర్‌కు అందించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, మధుసూధనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు ఛత్రపతి శంభాజీ రాజేతో వచ్చిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అడవుల రక్షణ కోసం అంకితభావంతో పనిచేయాలి

పిసిసిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అడవుల రక్షణ విషతయంలో క్షేత్రస్థాయి సిబ్బంది మరింత అంకిత భావంతో పనిచేయాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం డోబ్రియాల్ కోరారు. గురువాం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఏడాది కాలంలో పనితీరులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్వాతంత్ర్య సమరయోధులు, వీరజవాన్ల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు హరితహారం నేడు దేశ వ్యాప్త ప్రశంసలు అందుకుంటున్నదన్నారు. ఆ పథకం విజయవంతంలో అటవీ శాఖలో పని చేస్తున్న ప్రతిఒక్కరికీ భాగస్వామ్యముందని ప్రశంసించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

తెలంగాణ వ్య.కా.స రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అన్నారు. గురువారం జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం నెల్లుట్ల-పటేల్‌గూడెం భూ పోరాట కేంద్రాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని సంక్రాంతి క్రీడోత్సవాల్లో గెలిచిన ఔత్సాహితులు, క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగయ్య మాట్లాడారు. రాజ్యాంగం మౌలిక సూత్రాలైన సామ్యవాదం, గణతంత్రం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థకు కేంద్ర బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే సిఎఎ, జీఎస్టీ లాంటి అనేక కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తుందన్నారు.దేశంలో హత్యలు, లైంగికదాడులు పెరిగిపోయాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోని అన్ని వర్గాల, తరగతుల ప్రజానికానికి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింగారపు రమేష్, ఎదునూరి వెంకట్రాజం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోటి దేవదానం, బొట్ల శేఖర్ నాయకులు గోసంగి శంకరయ్య, లగ్గాల రమేష్, పుల్ల రాజేశ్వరి, గడ్డం రేణుక, మునుగొండ రేణుక, పిడుగు సరిత, బండ శ్రీనివాస్, సురేష్, నల్ల ప్రణయ్, చిరంజీవి, గోసంగి సందీప్, ఉప్పలయ్య, వేల్పుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR VEHICLE ACCIDENT TRIBUNAL CUM CHIEF JUDGE CITY CIVIL COURT AT; HYDERABAD
OP NO 2847 OF 2021
BETWEEN;
Aggur Ramesh and others
...Petitioner.
AND
TS RTC and another
...Respondents
NOTICE
To
R2. Racha Ganapathi, S/o Narsaiah Age 59 Years, Occ; RTC Driver, Mancheriyal Depot R/o H. NO 4-4-24/2/328/3/3, Sanjay Magar, Adilabad (Driver of the RTC BUS B. No AP 29 Z 0551)

Please take Notice that the above petitioner filed claim Petition against you and the respondent No 1, several times notices were issued to you through court and R.P but you have failed to receive the same, the case is posted on 03/02/2023. for your appearance on that day you have to appear is person or with your counsel at 10.30 A.M before the Honble court, Other wise case will be decided against you
(BY ORDER OF THIS HON'BLE COURT)
K. RANJITH KUMAR
ADVOCATE
Shri Siddhi Sai Niwas, H.No; 12-1-124/21, Road No 1, Ayodhya Nagar Colony, Bandlaguda, Nagole, Hyderabad. Pin 500068
PH 9866621201

కరెంట్ కోతలు.. రైతు వెతలు

- అనధికారిక కోతల వల్ల తిప్పలు
- వరి, ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి
- ఎండలు ముదిరితే మరింత కష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనధికారిక విద్యుత్ కోతల వల్ల వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని కొండాపూర్, గంగారం, గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ వంటి గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద వరి, గోధుమ, మొక్కజొన్న, శనగ, పసుపు, ఉల్లి పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్నారు. మామిడి, సపోట, కొబ్బరి, జామ ఇతర పండ్లు, పూల మొక్కల నర్సరీలు 500 వరకు సాగవుతున్నాయి. ఈ పంటలకు బోరు బావుల వ్యవసాయ మోటర్ల ద్వారానే నీటి పారకం జరుగుతుంది. త్రిఫేజ్ కరెంట్ ఉన్నప్పుడు మాత్రమే మోటార్లు నడుస్తాయి. 15 రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో వరినాట్ల పనులకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ముందస్తుగా వరినాట్లు పూర్తయి పచ్చపడుతున్న పైర్లకు సరిపడా నీళ్లు అందట్లేదు. అలాగే ఆరుతడి పంటలకు మూడు నాలుగు రోజుకో తడి చొప్పున నీళ్లు కడతారు. నర్సరీలకు రోజూ ఉదయం, సాయంత్రం పూట నీళ్లు పెడతారు. కరెంట్ కోతలు, తరచూ సరఫరాలో బ్రేక్ డౌన్స్ అవుతుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ట్రిప్ అవ్వడం, ఫ్యూజులు పోవడం వంటి సాంకేతిక సమస్యలతో పంటలెండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గంగారంకు చెందిన దేవయ్యకు పదెకరాల పొలముంది. యాసంగీలో రెండెకరాల్లో వరి, మిగతా పొలంలో గోధుమ, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేశాడు. ఐదారు రోజులుగా కరెంట్ సరిగ్గా రాకపోయే సరికి ఆరుతడి పంటలకు నీళ్లు పెట్టకపోవడం వల్ల వాడుపట్టాయని తెలిపాడు. కరెంట్ కోతల వల్ల మోటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని పేర్కొన్నాడు. సర్దార్ అనే రైతు రెండెకరాల్లో గోధుమ, ఎకరంలో వరిసాగు చేశాడు. గోధుమకు నీళ్ల కట్టడానికి కరెంట్ కోత వల్ల వీలుకావడంలేదని తెలిపాడు. పొద్దున్నే నీళ్లు పెడదామని ఉదయం ఆరు గంటలకు పొలం వద్దకెళ్తే సాయంత్రం వరకు కరెంట్ రాలేదన్నాడు. గోధుమ, ఇతర ఆరుతడి పంటలకు నీళ్లు కట్టలేదన్నాడు. అప్పటికే తడారిపోయిన పైర్లకు నీళ్లు కట్టకపోయేసరికి ఎండిపోతున్నాయని తెలిపాడు.

సంగారెడ్డి జిల్లాలో 99,616 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. యాసంగి సీజన్‌లో 60 వేల ఎకరాల్లో వరినాట్లేశారు. మెదక్ జిల్లాల్లో 57693 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యాసంగిలో 1.35 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. మరో 50 వేల ఎకరాల్లో నాట్లు వేయనున్నారు. సిద్దిపేట జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి నాట్లు వేశారు. జిల్లాలో 80 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. యాసంగిలో వరితో ఆరుతడి పంటలేశారు. వీటికి ఎక్కువ మొత్తంలో విద్యుత్ మోటర్ల ద్వారానే నీటిని అందిస్తున్నారు.

అనధికారిక కోతలు..

వ్యవసాయానికి ఒక్కో సర్కిల్‌లో ఒక్కో విధంగా కరెంట్ సరఫరా అవుతోంది. ఎక్కువ ప్రాంతాల్లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు, ఇంకొన్ని చోట్ల ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇలా ఆయా సర్కిల్స్, సబ్‌స్టేషన్ల వారిగా సగటున రోజుకు పది నుంచి 12 గంటలు వ్యవసాయానికి సరఫరా చేస్తున్నారు. ఇందులో మధ్యమధ్యలో నాలుగైదు సార్లు కోత పెడుతున్నారు. సరఫరాలో మధ్య మధ్యలో ట్రిప్ అవ్వడం, సాంకేతిక లోపాల పేర కట్ కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోతలకు తోడు ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయి. సిద్దిపేట జిల్లాలో డిసెంబర్ నెలలో 353 ట్రాన్స్‌ఫార్మర్లు, జనవరిలో 182 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోనూ ఈ నెలలో 350 ట్రాన్స్‌ఫార్మర్లు వరకు కాలిపోయినట్టు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసి బిగించడానికి రెండు మూడు రోజులు పడుతుండటంతో పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నీటి ఎద్దడితో దెబ్బతింటున్న పైర్లు

కరెంట్ కోతల వల్ల ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి ఏర్పడుతుంది. మోటర్లు నడవక కింది పొలాలు వాడుబట్టిపోతున్నాయి. వరి, ఇతర పైర్లకు తెగుళ్లు సోకాయి. పురుగుమందులు పిచికారి చేస్తున్నందున పొలాల్లో గుంటలు పడి నీటి మట్టం తగ్గింది. పైర్లు ఎదగడం, చలితగ్గి ఎండలు కాస్తుండటంతో నీటి వినియోగం పెరుగుతోంది. ఆటోమెటిక్ స్టాటర్ పెడితే వచ్చిపోయే కరెంట్ ఎచ్చుతగ్గుల వల్ల మోటర్లు కాలిపోతున్నాయి. గోధుమలు, మొక్కజొన్న, కూరగాయలు ఇతర ఆరుతడి పైర్లకు సమయానుకూలంగా నీరు కట్టలేకపోతున్నారు.

కోతల వల్ల పొలాలు ఎండుతున్నయ్ - భూమయ్య, రైతు, రేగోడు, మెదక్ జిల్లా

వారం పది రోజులుగా కరెంట్ కోతలు పెడుతున్నారు. పైర్లు ఇప్పుడే పచ్చపడుతున్నాయి. రోగాలొస్తే మందులు కొట్టినం. చలి తగ్గి ఎండ పెరిగే సరికి నీటి వినియోగం పెరిగింది. తీరా కరెంట్ సరిగ్గా రాకపోయే సరికి కింది పొలాలకు నీళ్లు పారడంలేదు. కరెంట్ 12 గంటలిస్తున్నమని లైన్‌మెన్ చెబుతడు. మోటరు పెడితే ఎప్పుడు పోస్తదో ఎప్పుడు ఆగిపోతదో తెల్వని పరిస్థితి. పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నం.

పొలాల వద్దే ఉంటున్నం - దేవయ్య, గంగారం, సంగారెడ్డి జిల్లా

కరెంట్ కోతల వల్ల పొలాల వద్దే ఉంటున్నం. కరెంట్ వచ్చిందంటే మోటర్ పెడతం. పోయి ఎప్పుడు వస్తదో తెల్వక బావికాడే ఉండాల్సి వస్తుంది. వరి నాట్లేసి పది రోజులైంది. సరిగ్గా నీరు పారట్లేదు. గోధుమ, మొక్కజొన్న, మిరప, ఆకుకూరలు, కూరగాయలకు నీళ్ల తళ్లు సమయానికి పెట్టకపోతే ఎండిపోతయి. రెండు మూడు రోజులుగా కరెంట్ సరిగ్గా రాక పైర్లన్నీ వాడుబట్టినయి. రోజూ కరెంట్ తీస్తే పంటలన్నీ ఎండి పెట్టుబడి మట్టిపాలవుతుంది.

మంచి సినిమాలకు భరోసా ఎస్‌వికె...

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనిషి కేంద్రంగా పేదల పెన్నిధిగా మంచి సినిమాలకు భరోసాగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఉన్నదని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అభినందించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షార్ట్ ఫిలిమ్‌లు, కళారూపాల ప్రదర్శన కోసం దాశరథి థియేటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామాజిక అంశాలతో కూడిన సినిమాలు తీస్తున్న నిర్మాతలను, డైరెక్టర్లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడికి సినిమాయే ప్రధాన వినోదం అని, కానీ ఆ కాస్త వినోదం దక్కకుండా చేస్తున్నారన్నారు. మంచి సందేశాత్మక సినిమాలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలు చెబితే నిలువునా తగలబెడుతున్నారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తామున్నామంటూ లఘు చిత్ర పరిశ్రమకు భరోసానివ్వడం సాహసంతో కూడిన నిర్ణయం అని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, టికెస్‌కెను అభినందించారు. సినిమాలపై పన్నుల భారం తగ్గించాలని, పైరసీ మాఫియాలను అరికట్టాలని, లఘు చిత్రాలను ప్రోత్సహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ.. తక్కువ సమయంతో ఆకర్షణీయంగా ఉండే లఘు చిత్రాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. సందేశాత్మక విభిన్న కథలతో ప్రేక్షకుల్లో విజ్ఞానం వినోదం అందిస్తున్నాయని, దీన్ని ఎస్‌వీకే ప్రోత్సహిస్తుందని తెలిపారు. లఘు చిత్రాల ప్రదర్శన నిరంతరాయంగా జరుగుతుందని, మనమంతా ఒక్కటే మనుషులే మనకు ముద్దు అంటూ సినిమాలు రావాలని సూచించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత డాక్టర్ జి.అనుష రెడ్డి, లఘు చిత్రాల ఇన్‌చార్జి, నటుడు బిడిఎల్ సత్యనారాయణ, సత్య భాస్కర్, ఎస్‌వికె బాధ్యులు జి బుచ్చిరెడ్డి, ఎన్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో సందడి నెలకొన్న మేడారం

మేడారంలో సందర్శకుల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలకు గురువారం సందర్శకులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. జంపన్న వాగు వద్ద పుణ్య స్నానాలాచరించి, కళ్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. గద్దెల వద్దకు చేరుకుని వనదేవతలకు ఇష్టమైన పసుపు, కుంకుమ, చీరే సారే సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా, సరిహద్దు రాష్ట్రాల నుంచీ సందర్శకులు అధిక సంఖ్యలో భారీగా తరలివచ్చారు. వీరికి ఎండోమెంట్ ఇఒ రాజేంద్రం ఆధ్వర్యంలో ఎండోమెంట్ అధికారులు, పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు సకల సౌకర్యాలు కల్పించారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం బయట చెట్ల కింద విడిది చేసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వారి గ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. పూజారులు కొక్కర కృష్ణయ్య, సిద్ధబోయిన రమేష్, మునీందర్, లక్ష్మణరావు, అరుణ్, కాక సారయ్య, కాక కిరణ్, ఎండోమెంట్ అధికారులు క్రాంతి, రాజేశ్వర్, రమాదేవి, జగదీశ్వర్, బాలకృష్ణ మధు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సింక్రోనీ స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్ : వెనుకబడిన వర్గాల వారికి.. మరి ముఖ్యంగా చదువుకునే మహిళలకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఆర్థిక సేవల కంపెనీ సింక్రోనీ తెలిపింది. 'ఎడ్యుకేషన్ యాజ్ యాస్ ఈక్వలైజర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ కింద సింక్రోనీ ఫౌండేషన్ మద్దతును అందిస్తున్నట్లు పేర్కొంది. స్కాలర్‌షిప్‌లు, మెంటర్‌షిప్స్‌కు రూ.44 లక్షలు (55వేల డాలర్లు) కేటాయించినట్లు తెలిపింది. బాలికా విద్య పట్ల కంపెనీ అధికంగా దృష్టి సారించడంతో సింక్రోనీ ప్రస్తుతం 119 మంది విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా మద్దతు అందిస్తుందని తెలిపింది. వీరిలో 88 శాతం మంది మహిళా విద్యార్థులు ఉన్నారని వెల్లడించింది.

ఎంఎస్‌డిఇ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్

హైదరాబాద్ : నైపుణ్యాభివద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డిఇ) హైదరాబాద్‌లో జాతీయ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. తెలంగాణా రాష్ట్రంలో తొలిసారి ఎన్‌టిఎస్‌ఐ వద్ద నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఐటిఐలు, జూనియర్ కాలేజీల్లోని 350 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆ సంస్థ తెలిపింది. అప్రెంటిస్‌షిప్ సంస్కరణలు, శిక్షణల అమలును వేగవంతం చేయడానికి దేశవ్యాప్తంగా 250కంటే ఎక్కువ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. తద్వారా సంస్థలు, ఔత్సాహికులు, భాగస్వాముల నడుమ అప్రెంటిస్‌షిప్ సంస్కరణల పట్ల అవగాహన కల్పించనున్నారు. రీజినల్ డైరెక్టోరేట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ సంబంధిత ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గణతంత్ర దినోత్సవం రోజునే పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. నిజామాబాద్ నగరంలోని సారంగాపూర్ డెయిరీ ఫార్మ్ వద్ద డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లా కేంద్రానికి చెందిన పెద్ద కాసులు శ్రీశైలం (52) గతేడాది కిందట వరంగల్ నుంచి నిజామాబాద్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చారు. 11 రోజుల కిందట అనారోగ్య సమస్యలతో బాధపడ్డాడు. కాగా, బుధవారం కామారెడ్డిలో జరిగిన సమావేశంలోనే కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి వారి యోగక్షేమాలను కనుక్కొని జాగ్రత్తగా ఉండాలని వారికి సూచించారు. కానీ తండ్రి మాటలకు అనుమానం వచ్చిన కుమారుడు రవితేజతోపాటు కుటుంబ సభ్యులు నిజామాబాద్‌కు బయలుదేరి వచ్చారు. కానీ అప్పటికే 'తన చావుకు ఎవరూ కారణం కాదు' అని సూసైడ్ నోట్ రాసి శ్రీశైలం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎడి కార్యాలయానికి వచ్చిన కుటుంబ సభ్యులు శ్రీశైలం ఉంటున్న గది లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో దాన్ని బద్దలు కొట్టారు. అప్పటికే ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఆరో టౌన్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

ఈటల లక్ష్యం బిజెపిలో నెరవేరదు

- రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ పార్టీ నుంచి బిజెపిలో చేరిన ఈటల రాజేందర్, వివేక్‌తో పాటు కొండా విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి సిద్ధాంతాలను విశ్వసించరని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలిపారు. వారు నమ్మిన సిద్ధాంతంపై నడవాలని సూచించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా ఆయన ముచ్చటించారు. సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలన్న లక్ష్యంతో బిజెపిలో చేరిన ఈటల రాజేందర్‌కు, ఆ లక్ష్యం బిజెపిలో నెరవేరడం లేదని అర్థమైందని ఆయన మాటలను బట్టి తెలుస్తుందన్నారు. కెసిఆర్ కోవర్టులతో నిండిన బిజెపిని కాదనీ రాజేందర్ ప్రత్యామ్నాయ మార్గం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈటల పరిస్థితి ముందుకు పోలేక, వెనక్కి రాలేక అన్నట్టుగా ఉందన్నారు. ఈటల వామపక్షవాది అయినా... కెసిఆర్ కుట్రతో రైటిస్ట్ పార్టీలోకి పోయేలా చేశారని తెలిపారు. కేవలం కెసిఆర్‌పై వ్యతిరేకతతో బిజెపిలో చేరిన మిగిలిన నాయకులు కూడా ఆ పార్టీలో సంతప్తిగా లేరని చెప్పారు. సచివాలయాన్ని కెసిఆర్ జన్మదినాన కాకుండా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు.

అన్నం తినే పళ్లాలుతో నిరసన చేస్తున్న రోజువారి కార్మికులు

36 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలి..

పళ్లాలతో హాస్టల్ రోజువారి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

. 36 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌టీ రోడ్ లేడీస్ హాస్టల్ వర్కర్లు 'కడుపు కాలుతోందని' అన్నం తినే పళ్లాలు పట్టుకొని నిరసన తెలిపారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీవేజ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు మాట్లాడుతూ హాస్టల్ డైలీవేజ్ కార్మికులకు మూడేండ్లుగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించకపోతే ఏ క్షణమయినా నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు నెలనెలా 1న జీతాలు తీసుకుంటున్నారని, కానీ కార్మికులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మంత్రి ఉన్న ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే మంత్రి జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఒక నెల జీతం రాకపోతేనే తీవ్ర ఆర్థిక ఇబ్బందులూ పడే పరిస్థితిలో మూడేళ్లుగా జీతాలు ఇవ్వకపోతే వారు ఎంత దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారో అధికారులు గమనించాలని సూచించారు. వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై విక్రమ్, కాంపాటి వెంకన్న, ప్రవీణ్, సంతోష్, లక్ష్మి దేవి, వీరమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిఎన్‌బి జెండా వేడుక

హైదరాబాద్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ సర్కిల్ కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలను నిర్వహించింది. ఆ బ్యాంక్ సర్కిల్ హెడ్ ఎన్‌విఎస్‌పి రెడ్డి జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, బ్రాంచీల అధికారులు పాల్గొన్నారు.

టిఎస్‌ఎంసికి ఎన్నికలు నిర్వహించకుంటే వైద్యగర్జన తప్పదు

- డాక్టర్ల సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టిఎస్ఎంసి)కి ఎన్నికలు నిర్వహించకపోతే హైదరాబాద్ వైద్యగర్జన నిర్వహిస్తామని డాక్టర్ల సంఘాలు హెచ్చరించాయి. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (టిడిఎఫ్) ఆధ్వర్యంలో టిఎస్ఎంసి ఎన్నికలు, నకిలీ వైద్యం నుంచి ప్రజారోగ్య రంగాన్ని పరిరక్షించుకోవడం, బలోపేతం చేయడం అనే అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ), హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్ డిఎ), తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) నాయకులు పాల్గొన్నారు. టిడిఎఫ్ అధ్యక్షులు డాక్టర్ అన్వేష్, హెచ్ఆర్‌డిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, అధ్యక్షులు డాక్టర్ మహేశ్ కుమార్, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బిఎన్ రావు, టీజూడా ప్రతినిధులు డాక్టర్ కౌశిక్, డాక్టర్ రాహుల్, డాక్టర్ కర్షిణి, టిడిఎఫ్ కన్వీనర్ డాక్టర్ విజయేందర్ మాట్లాడారు. నిర్దేశించిన సమయంలోపు ఎన్నికలు నిర్వహించకుంటే వైద్య గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ప్రాక్టీసింగ్ డాక్టర్లతో వైద్య గర్జన నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో నకిలీ వైద్యం నాటుసారా మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రులు, డాక్టర్లు రోగుల నుంచి వసూలు చేస్తున్న బిల్లుల నుంచి 30 నుంచి 70 శాతం సిఫారసు చేసిన నకిలీలకు చెల్లిస్తుండటంతో పేద రోగులపై ఆర్థిక భారం పెరగడానికి కారణమన్నారు. 12 ఏళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలను సమర్పించాలనీ, అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో మెడికోల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని తీర్మానించారు.

కుల, మతాంతర వివాహాల సంఖ్య పెరగాలి

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ జి చంద్రయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుల మతాలకతీతంగా సమ సమాజం ఏర్పడాలంటే కులాంతర, మతాంతర వివాహాలు మరింత పెరగాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ డాక్టర్ జి చంద్రయ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద గురువారం కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండి వహీద్ అధ్యక్షతన కులాంతర మతాంతర వివాహితుల మేళా 51వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంబేద్కర్ నాయకత్వంలో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం అణగారిన వర్గాలకు కొత్త వెలుగులను ప్రసాదించిందన్నారు. అంటరానితనం, ఇతర అన్ని రకాల వివక్షలను రూపుమాపి వారికి హక్కులను, బాధ్యతలను, అవకాశాలను కల్పించిందన్నారు. తద్వారా వ్యక్తి సమానత్వం, సాంఘిక సమానత్వం, సమాన అవకాశాలు అభివృద్ధి, లింగ సమానత్వం దిశగా కొంత సిద్ధించినప్పటికీ చిత్తశుద్ధి లేని ప్రభుత్వాల వల్ల ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి 1971లో కుల నిర్మూలన సంఘం ఏర్పడిందని తెలిపారు. కుల నిర్మూలన సంఘం ఏర్పడిన తర్వాత కొన్ని వేల కులాంతర, మతాంతర వివాహాలు, ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించారని తెలిపారు. తత్ఫలితంగా నేడు సమాజంలో కులాంతర వివాహాలు విరివిగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సామాజిక, రాజకీయ పరిస్థితులు

కులాంతర మతాంతర వివాహితుల మేళాలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

కుల, మతాల చుట్టూ తిరుగుతూ మనుషుల మధ్య దూరాన్ని మరింత పెంచుతున్నాయన్నారు. కులాంతర, మతాంతర వివాహం చేసుకుంటున్న వారికి రక్షణ కల్పించేందుకు చట్టం తేవాలన్నారు. వారి ఆర్థిక స్థితిగతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నిటిలో కులాంతర, మతాంతర వివాహితులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా కవి జయరాజ్, ప్రముఖ హేతువాది సుబ్బరాజు, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు గోవర్ధన్, కుల నిర్మూలన సంఘం సలహాదారులు లక్ష్మీ నాగేశ్వర్, గౌరవాధ్యక్షులు గుత్త జోత్స్న, విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, టిపిఎస్‌కె కన్వీనర్ రాములు, మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సమతా మిషన్ సీఆర్ శేఖర్, కులాంతర మతాంతర వివాహితుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణచంద్, కార్యనిర్వాహక కార్యదర్శి బిబిషా పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఎల్‌హెచ్‌ఒలో గణతంత్ర వేడుకలు

హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) లోకల్ హెడ్ ఆఫీసులో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాంక్ సిజిఎం అమిత్ జింగ్రాన్ జెండావిష్కరణ చేశారు. స్వాతంత్రయోదుల పోరట ఫలితాలను గుర్తు చేసుకోవాలని జింగ్రాన్ అన్నారు. తెలంగాణలో గొల్కొండ, కాకతీయ కోట, రామప్ప గుడి తదితర చారిత్రక కట్టడాలతో అనేక సంప్రదాయాలను కలిగి ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఎస్‌బిఐకి 22,000 శాఖలు, 50వేల పైగా ఎటిఎం కేంద్రాలు, 70వేల పైగా టచ్ పాయింట్లతో తమ ఖాతాదారులకు సేవలందిస్తుందన్నారు.

భయపడం.. పోరాడుడే..

- నిరుపేదలకు ఇళ్ల పట్టాలు వచ్చే వరకు ఉద్యమాలు
- గుడిసెవాసులకు అండగా ఉంటాం
- ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య
- భూపాలపల్లి, చిల్పూర్‌లో గుడిసెల సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని, పెద్దోడికి ఒక న్యాయం పేదోడికి ఒక న్యాయమని, నిరుపేదలకు ఇండ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడుడే.. అని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య స్పష్టంచేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు శిఖం భూమిలోని సర్వే నెంబర్ 280, 283, 284, 285లలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటి స్థలాల పోరాటం చేపట్టి సుమారు 500మంది బుధవారం గుడిసెలు వేయగా, వారిని గురువారం కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు మాధవితో కలిసి వీరయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని అనేక వాగ్దానాలు ఇచ్చినప్పటికీ నేటి వరకు అమలు కాలేదన్నారు. ఇప్పుడు కొత్తగా.. సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని, తదనందరం రూ.3లక్షలు ఇస్తామంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని ఆరోపించారు. నిరుపేదలకు 100 గజాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 50కి పైగా భూపోరాట సెంటర్లలో ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు నడుస్తున్నాయని తెలిపారు. గతేడాది నుండి భూపోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలు వేసుకున్న ఈ భూమి.. ప్రభుత్వ అధికారులు శిఖం భూమి అంటూ చెబుతున్నప్పటికీ, ఈ చెరువుకు గండి ఎందుకు కొట్టారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలపై అక్రమ కేసులు పెట్టినా, గుడిసెలు కూల్చినా సహించేది లేదని, సిపిఎం వారికి అండగా ఉండి ఇంటిస్థలం దక్కేవరకు పోరాడుతుందని భరోసా ఇచ్చారు. మతోన్మాద బిజెపిని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన గడ్డపై అడుగుపెట్టనీయకుండా అడ్డుకునేందుకు మాత్రమే బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచామని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీపడబోమని తెలిపారు. సమస్యలను పరిష్కరించలేని లేనిపక్షంలో ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అంతకు ముందు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో 79 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పోరాడుతున్న గుడిసె వాసులకు మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన కార్యక్రమంలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. గుడిసెవాసులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపెటి రాజన్న, చెన్నూరి రమేష్,పొలం రాజేందర్, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు వ్యకాస జిల్లా కార్యదర్శి ఎదునూరి వెంకట్రాజం, భూ పోరాట కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.